స్నేహితులు

[కథానిక]

శ్రీ అందే నారాయణస్వామి

పార్థసారథికీ, ముకుందానికీ విరోధం వచ్చిందన్న వార్త విని గ్రామస్థులు ఆశ్చర్యపడ్డారు. ఇద్దరూ ప్రాణస్నేహితులు. ఆఫీసువేళల్లోతప్ప వాళ్ళను ఒంటరిగాచూసిన వాళ్ళు వుండరు! లోగడ వాళ్ల స్నేహాన్ని చూసి అసూయపడ్డవాళ్లు కొందరు సంతోషించారుగూడా! ఇప్పుడు ఇద్దరికీ నోటి మాటలే కాకుండా కళ్ల చూపులు గూడా లేకుండా పోయినవి. ఇద్దరూ బజారులో తారసిల్లినా ఆమడదూరం తొలిగిపోతున్నారు. పార్థసారథినీ, ముకుందాన్నీ గూడా ఇంట్లో పెద్దవాళ్లు "ఒరే! మీరు బాల్యస్నేహితులు. ఒకకంచాన తిని ఒకమంచాన పండినవాళ్లు కదా, మీకెందుకురా యీ విరోధం?" అని కూకలు వెయ్యకపోలేదు. "నేనేమీ అనలేదు. వాడే నాతో మాట్లాడడం లేదు" అని ఒకరూ, "నావల్ల తప్పేమీ లేదు. వాడే బిగుసుకు పొయ్యా" డని మరిఒకరూ—యిట్లా యెవరిమటుకు వాళ్లు సమాధానాలు చెప్పారు. పెద్దవాళ్లు మందలించినా వాళ్ల మనస్సులు మారలేదు.

ఆ గ్రామంలో రెండు పార్టీలు. రెంటికీ బద్ధవైరం. ఒకపార్టీవాళ్లు యేపని తలపెట్టినా (అది గ్రామానికి మేలుచేసేదిగాని, కీడుచేసేదిగాని) రెండోపార్టీవాళ్లు ప్రతిఘటించి దాన్ని కాకుండా చెయ్యడమే వాళ్ల పని. ముకుందం రెండోపార్టీలో చేరిపొయ్యాడు. వాళ్లకు మరింత బలం చేకూరింది. ముకుందం పార్టీవాళ్లు అవతలపార్టీవాళ్లంటే ఒంటికాలిమీద వెళ్లడం మొదలుపెట్టారు. గ్రామరాశి రాములవారి కోవెలపూజాపురస్కారాలపట్ల రెండుపార్టీలకూ తగాదాలు వచ్చి అదివరకే వ్యాజ్యాలు పడి గుడికి తాళాలు వేసుకున్నారు. ఒకరోజు సాయంత్రం కోవెల ఆవరణలో మొదిగివున్న గడ్డిని పార్థసారథిగారి పాలేరు కోస్తూ వుండగా అవతలిపార్టీవాళ్లు వచ్చి కొడవలి, తట్ట లాక్కుని పాలేరును కొట్టి పంపారు. కొట్టడానికి వచ్చిన గుంపులో ముకుందం కూడా వున్నాడు. అప్పుడు పార్థసారథి అవతలిపార్టీలోని కొందరి పేర్లు చేర్చి చార్జి పెట్టాడు. అక్కడ విశేషమేమిటంటే! ముకుందాన్ని మాత్రం అందులో చేర్చలేదు. అందుకు పార్టీలో కొందరు పార్థసారథిని "ఏం మాజీస్నేహితుడనా అతణ్ణి చేర్చలే" దని దుయ్యబట్టారు. అందుకు అతడు వాళ్ల కిచ్చిన సమాధానం ఇది: "వాణ్ణి ఇటువంటి చచ్చుకేసుల్లో ఇరికిస్తే ఏం లాభం? గురిచూసి దెబ్బకొడితే ఇక యెప్పటికీ తలయెత్తకుండా వుండాలి. వాణ్ణి వదిలిపెట్టానని యెంచవద్దు" అని.

ఇక ముకుందం వాళ్లతో వీళ్లతో "నాపేరు పెట్టడానికి వాడికి గుండె లెక్కడున్నాయి! మనమంటే వాడికి సింహ స్వప్నం" అని చెప్పుకున్నాడు.

2

ఆరుమాసాలు గడిచినవి. ముకుందానికి పార్టీసంబంధమైన కక్షలు అట్లా వుండనిచ్చి మరిఒక అవాంతరం వచ్చిపడ్డది. ముకుందానికీ పక్కఇంటి ఆసామీకీ లోగడ పరాకత్తు గోడదగ్గర తగాదా వచ్చి వ్యాజ్యాలు వేసుకోవడందాకా జరిగింది. అవతలఆసామీ వున్నవాడు. ముకుందాన్ని లొంగదీయడానికి ముకుందం అవతల మరిఒక ఆసామీకి బాకీవున్న నూటయాభైరూపాయల ప్రాంసరీ నోటును ప్రతిఫలం యిచ్చి తనపేరటికి ఆర్డరు వేయించుకుని ముకుందానికి రిజిష్టరు నోటీసు గూడా ఇచ్చాడు. అయితే ఆరునూరైనా ముకుందం ఒకళ్లకు లొంగే ఘటం కాదు. ముకుందం పరిస్థితులు చూద్దామా! వున్నవాడేమీ కాదు. జీతంరాళ్లవల్లనే జీవనం. అందులో అప్పో సప్పో చేసి గోడకేసులో కొంత ఖర్చుకూడా పడివున్నాడు. చేతిలో కానీలేదు. వెంటనే సొమ్ము చెల్లించకపోతే అతడు దావావేసి జప్తుతెచ్చి తనను పరాభవించేటందుకు సిద్ధంగా వున్నాడు. ఏ కాస్త లోటు కనిపించినా గోరంతలు కొండంతలు చేసి మనిషిని గేలిచెయ్యడానికి వేయి కళ్లతో యెదురుచూస్తున్నది అవతలపార్టీ ఒకటి. తన మానాన్ని తాను గౌరవంగా జీవిస్తున్న అతని కది మనోవ్యథ కలిగించింది.

బాకీ చెల్లించివేద్దామని అప్పుకోసం ప్రయత్నించాడు కాని యెక్కడా అప్పుపుట్టలేదు. పిచ్చివాడిలా తిరిగితిరిగివచ్చి ఈ ఆపదనుండి బయటపడే దెట్లాగా అన్నవిచారంతో ఇంటివసారాలో మంచానికి చేరగిలపడ్డ ముకుందానికి మెరుపులా ఒక ఊహ తట్టింది. తన అన్నకుమారుడు-డాక్టరు-కాకినాడలో ప్రాక్టీసు పెట్టి, బాగా డబ్బు గడిస్తున్నాడు. అతడు తానంటే ఎంతో ఆదరాభిమానాలు కలవాడు. ఈఅవస్థంతా దేనికి, అతనికి వ్రాసి డబ్బు తెప్పించుకుందా మనుకొని ముకుందం వెంటనే కాగితం కలం తీసుకుని ఏకాంతంగా కూర్చుని, ఇట్లా యిబ్బందిలో వున్నాననీ, ఓ నూటయాభై రూపాయలు పంపితే వెంటనే మళ్ళా తీర్చి వేస్తాననీ, రెండు గంటలసేపు ఆలోచించి మూడుపేజీల ఉత్తరం వ్రాసి కవరును స్వయంగా పోష్టులో వేసి వచ్చాడు.

కాకినాడకు ఉత్తరం వ్రాసి వారంరోజులయింది. తన పేరటికి డబ్బు వస్తుందని వరసన మూడురోజులనుంచి ముకుందం పోష్టుకు వెళ్ళివస్తూన్నాడుగాని అంతవరకూ ఏమీ రాలేదు. ఆవాళ తప్పకడబ్బువస్తుందన్న దృఢనిశ్చయంతో టపా వచ్చేవేళకు పోష్టాఫీసుకు వెళ్లాడు. ఆవాళగూడా ఏమీ రాలేదు. ముకుందం నిస్పృహతో ఇంటిదారి పట్టాడు.

పెద్దబజారునే వెళ్లిపోతూవున్న ముకుందానికి అటువైపే వస్తున్న పార్థసారథి కొంత దూరంలో కనిపించాడు. ఆపదకూ వైరానికీ చాలాదూరం. అందులో వెనక ఇద్దరిలో ఎవ్వరికి ఏఆపద వచ్చినా తమకు వచ్చినట్లు బాధపడుతూ ఒకళ్ళని ఒకళ్లు ఆదుకున్నవాళ్ళు. ముకుందానికి పార్థసారథిని పలకరించాలన్న సంకల్పం ఉదయించింది. తీరా తాను పలకరించిన తర్వాత అతడు పలకకపోతే తాను చిన్నపుచ్చుకోవలసివస్తుందే! పోనీ, పలకకపోతే

అతని మాట అతనికే వుంటుంది, తనమీద నెపములేకుండా పలకరిద్దాం! ఇంతమాత్రానికి తనకు వచ్చే నామోషీ ఏముంది-అన్న నిశ్చయానికి వచ్చాడు. అయితే ఏ నెపంమీద పలకరించేటట్టు? మళ్ళా ఆలోచనపడ్డది. వేరే నెపం అతని కేమీ గోచరించలేదు. 'ఏరా సారథీ, ఎక్కడికి వెళ్ళుతున్నావు?' అందామనుకున్నాడు. అసలే విరోధంగా వుంటున్నవాడిని ఎప్పటి లాగా 'ఏరా' అనిపిలిస్తే ఏంకోపం వస్తుందో! అట్లాగూడా కాదు. 'ఏం సారథీ! ఎక్కడికి వెళ్ళుతున్నావు?' అని మాత్రం పలకరిద్దామని తీర్మానించుకున్నాడు.

పార్థసారథి దాపులోకి వచ్చేశాడు. ముకుందాన్ని సమీపించాడుగూడ. తీరా అతడు సమీపించేసరికి ముకుందానికి నేరం చేసినవాడిలా గుండెలు కొట్టుకొన్నవి. పార్థసారథికేసి కళ్లప్పగించి వూరుకున్నాడు. మాట్లాడేటందుకు నోరు పిగల్లేదు. పార్థసారథి అతణ్ణి దాటివెళ్లిపొయ్యాడు. పాపం, ముకుందం వల్లెవేసుకున్నదంతా వృథా అయింది. అతడు దాటిపోవటంతో ముకుందానికి ఉక్రోషం ముంచుకొచ్చింది. తాను అతణ్ణి కలవేసుకునే తాహతు లేనివాడే కావచ్చు. అతడుమాత్రం తన నెందుకు పలకరించకూడదు? అతనికి తాను చేసిన ద్రోహ మేమిటి? డబ్బుకలవాణ్ణి, పార్టీ బలంకలవాణ్ణి అన్న అహంకారం బలిసింది. వీడి డబ్బెంత చేసు, వీడెంత చేసు! అసలు చేస్తున్నదంతా వీడే. అవతలవాడికి పుర్రట్లు పెట్టి మద్దత్తుగా వుండి కథ నడుపుతున్నదిగూడా వీడే. ఈ ఆలోచనలతో ముకుందం ఇల్లు చేరుకున్నాడు.

ముకుందం ఇక పోష్టుకు వెళ్లడం మానివేశాడు. ఆ రెండోరోజున అతడు ఇంటిపంచలో దిగులుగా కూర్చునివుండగా వీథితలుపు నెట్టుకొని పోష్టుజవాను వచ్చి ఒక కవరు యిచ్చి వెళ్ళిపొయ్యాడు. ముకుందం ఆత్రంతో కవరు చించి కాగితాన్ని పైకితీసి మడత విప్పాడు. అతని ఆశ్చర్యానికీ, ఆనందానికీ అంతు లేదు. అది తాను వ్రాసిన ప్రాంసరీనోటు. డబ్బు ముట్టినట్టు వెనుకపీఠన చెల్లు వ్రాయబడి, మెరుస్తూ ప్రక్కయింటి ఆసామీ సంతకంకూడా వున్నది. తన అన్నకుమారుడికి తానంటే ఎంత దయ! తాను సంగతులు, అన్ని వివరాలతో వ్రాసివుండడంవల్ల తనవాడు ఇక్కడి పరిస్థితులన్నీ శ్రద్ధతో గమనించి తన పేరటికి డబ్బుపంపి మళ్ళా తాను అవతల ఆసామీకి చెల్లించేలోపల అవతలవాడు తొందరపడి దావావేస్తాడేమోనని తలచి నేరుగా వాడికే డబ్బుకట్టి స్వయంగా నోటు తెప్పించుకుని తనకు పంపివేశాడు. ఎంత దూరదృష్టి కలవాడు! ఇక ఆ వాజమ్మలు యెన్ని కుట్రలు పన్ని తన నేం కదిలించగలరు? అయితే, దీనితోపాటు వుత్తరం ముక్కన్నా జతపరచలేదేం? అవును. ప్రొద్దస్తమానం వచ్చేవాళ్లూ పొయ్యేవాళ్లుగా తల్లో వెంట్రుకలంత మంది రోగులు వాణ్ణి వేపుకు తింటూవుంటారాయె. వ్రాసేటందుకు తీరిక యెక్కడుంటుంది? అయినా సజ్జనులకు ఇతరులకు సహాయపడడమే ముఖ్యలక్ష్యం. అట్లా చేశామనీ, ఇట్లా చేశామనీ యెన్నటికీ వారు వ్రాసుకోరు. ఇట్లా అనుకుని ముకుందం అప్పుడే కాగితం, కలం తీసుకుని—

"నాపరువు నిలబెట్టావు. నీమేలు ఎన్నటికీ మరిచిపోలేను. పరోపకారపరాయణు

లకు, స్వార్థత్యాగులకు మన భారతభూమి పుట్టినిల్లు. బిడ్డా! నిన్ను నేను పొగడగూడదు గాని నీబోటి పుత్రరత్నాలను గన్న భారత మాత ధన్యురాలు. పూర్వం మన ముత్తాత గారు గొప్పగొప్ప త్యాగాలు చేసి ఆ తరంలో మన వంశానికి గొప్ప పేరుప్రఖ్యాతులు తెచ్చాడని మానాయనమ్మ చెపుతూవుండేది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. యీతరంలో మన వంశానికి నీమూలకంగా పేరుప్రతిష్ఠలు రాగలవని నాకు చాలా నమ్మకంగా వున్నది. భగవంతుడు నీకు ఆయురారోగ్యము లిచ్చి రక్షించుగాక."

తన పాండిత్యాన్నంతా గుప్పించి పై ధోరణిలో చేటభారతమంత ఉత్తరం వ్రాసి పోష్టులో వేశాడు. అందుకు మూడోనాటికే జబాబు వచ్చింది. ముకుందం కవరు చించి చదవగా అందులో యిట్లా వున్నది:

"పూజ్యులైన చిన నాన్న గారికి,నమస్కా రములు—

మీరు వ్రాసిన రెండుఉత్తరములు చేరినవి. మీరు ముందుగా వ్రాసినప్రకారం డబ్బు పంపలేకపోయినందుకు మీరు నన్ను యద్దేవా చేస్తూ వ్రాసినందుకు చాలా విచారపడుతున్నాను. నేనంటే యెంతో వాత్సల్యంగల మీరు, మన స్తిమితంలో వుండి ఇట్లా వ్రాశారని నమ్మలేకుండా వున్నాను. నేను యేమో వ్రాసినానని అశ్రద్ధచేయక మీరు వెంటనే బయలుదేరి వచ్చి నాచేత పరీక్షచేయించుకోవలెనని మరీ మరీ కోరుతున్నాను."

ఉత్తరం చదువుకుని ముకుందం వెలవెల పోయాడు. తిక్కరావన్న ఇట్లా వ్రాశాడేం? అయితే డబ్బు ఎవరు కట్టినట్టు? తన అత్త వారు చూద్దామా, వాళ్ళదీ అంతంత మాత్రం సంసారమే! ఇక స్నేహితులని చూద్దామా, ముఖ్యమైనవాడే తనమీద కత్తికట్టె! ఆపదనుగుర్తించి తనకు అడ్డు పడగలవా ళ్ళింకెవ రున్నారు? అతనికి అగమ్యగోచరంగా వున్నది. పోనీ, తనకు డబ్బు యెలా చేరిందో ప్రక్కయింటి ఆసామీని యెవరిచేతనైనా అడిగించి అంతు తీయిద్దా మనుకుంటే అది అద్దెకొంప. ఇంటి యజమానిదిమాత్రం దగ్గరగ్రామం. ఇంతలో తన మేనత్తకు చీటీవ్రాసిపంపిన సంగతిఅతనికి చప్పున జ్ఞప్తికి వచ్చింది. కాకినాడకు వుత్తరం వ్రాసేనాటికి రెండురోజులముందు ఆవీథిలో యెవరో ఆగ్రామం వెళుతూంటే కోనూరులో వున్న తన మేనత్తగారికి డబ్బుపంపమని ఆషామాషీగా చీటీవ్రాసిపంపాడు. సొమ్ము ఆమె కట్టిందని ఇప్పు డతనికి అర్థమయింది.

3

తర్వాత రెండుమాసాలు గడచినవి. ముకుందం తగ్గేరకం కాదు. ఈ రెండుమాసాల బట్టీ ఇద్దరూ ఎన్నోసార్లు ఎదురుపడ్డా, ముకుందానికి పార్థసారథిని పలకరించాలన్న సంకల్పం ఆనాటితోనే అంతరించింది. రెండు పక్షాలకూ వైషమ్యాలు యథాప్రకారం నడచిపోతూనేవున్నవి.

ఆరోజున గ్రామంలో ఒక గగ్గోలు బయలుదేరింది. ముకుందం క్రిందటిరోజు సాయంత్రం కాలవకట్టమీద ఒక అమ్మాయితో మాట్లాడిన మాట నిజమే. ఆ అమ్మాయి తెల్లవారేసరికి ఇంట్లో లేదు. గడచిన రోజు సాయంత్రం ఆ ఇద్దరూ కాలవకట్టమీద మాట్లాడుకుంటున్నప్పుడు ఎవరు చూశారో మరి-ఆసంగతి కాస్తా గ్రామంలో పూదేశారు.

పార్టీలువున్న గ్రామంలో ఇటువంటి వార్తలకు వడి జాస్తి. అది ఆనోటా ఆనోటా పడి ప్రొద్దు పొడిచేటప్పటికల్లా,ముకుందం ఫలానా అమ్మాయిని లేవతీసుకెళ్ళాడన్న . వార్త గ్రామమంతా వ్యాపించింది. ఎవరినోటి వెంట వచ్చినా అదేమాట! ఏవీథిలో చూసినా అదే ముచ్చట! వీథిఅరుగులమీద నలుగురూ కూడడమూ—

"ఏమండో, మీకు తెలిసిందా?"

"అహా, తెల్లవారుఝామునే తెలిచింది"

"ముకుందాన్ని తెల్లవారి గ్రామంలో నేను చూశానే మరి!"

"అదంతా నాటకంలేండి. గ్రామంలో వుండి అందరికళ్ళ పడితే తాను లేవతియ్యలేదనుకుంటారుగా!"

"అంతేఅంతే. నిన్న సాయంత్రం ఇద్దరూ కాలవకట్టమీద గుసగుసలు ఆడుకుంటూ వుంటే కళ్ళారా చూచినవాళ్ళుండగా అంతకంటే నిదర్శన మేం కావాలీ?"

"ఈదెబ్బతో చూసుకోండి. నామాట వక్తిదైతే. రెండుపార్టీలూ తలపడి తలకాయలు పగలగొట్టుకోకపోతే అప్పుడనండి."

"మీర న్నట్టు కొంపలంటుకునేటట్లే వున్నది. ఇందులో తీసిపొయ్యేవాళ్ళెవరూ లేరు"

—ఇట్లా గ్రామమంతా అట్టుడికినట్టుడికి పోతున్నది.

ఆరోజు మధ్యాహ్నం పన్నెండింటికి మామూలుప్రకారం ఇంటికి భోజనానికి వచ్చిన ముకుందాన్ని భార్య "యేమిటండీ, మీమీద గ్రామంలో ఇట్లా వదంతిగా వున్న" దని ఆదుర్దాతో అడిగింది.

"అదాసంగతి! యిప్పుడు బజారునే వస్తూఉంటే అంతా నావంక అదోమాదిరిగా చూస్తున్నారు. ఏదో గుసగుసలాడుకుంటూ న్నారు. ఎందుకోననుకున్నాను" అన్నాడు ముకుందం.

"అంతా ఎరగనట్టు మాట్లాడతారేం, నిజం చెప్పండీ?"

"నాకేమీ తెలియదు"

"నాదగ్గర దాస్తారేం? పొరుగింటామె అంతా చెప్పింది. అదీ, మీరూ నిన్న కాలవ కట్టమీద మాట్లాడుకోలేదూ?"

"మాట్లాడిన మాట నిజమే"

"ఇంకేం,నంగనాచిలా మాట్లాడతారేం? ఇటువంటి వ్యవహారాల్లోగూడా దిగారూ!"

"అయితే ఏమని మాట్లాడామో వినవేం?"

"ఆడదానికీ, మగవాడికీ ఏంమాట లుంటవి? ఊరికే పుడుతుందా వదంతి?"

"వాళ్ళకు పుట్టిన పిచ్చ నీకూ పుట్టిందీ? ఇదంతా అవతలపార్టీవాళ్ళు చేస్తున్న దుష్ప్రచారం! నిన్న సాయంత్రం నేను కాలవకట్టనే షికారువెళ్ళివస్తూన్నాను. ఆ అమ్మాయి రావిచెట్టుదగ్గర ఎదురుపడ్డది. చేతిలో కొడవలి వున్నది. నన్ను చూసి నిలబడి 'ఇటు ఎవరైనా వెళ్ళారా?' అని అడిగింది. అందుకు నేను 'నీకు ఎవరు కావాలీ? పేరుచెపితే చెపుతా' నన్నాను. అందుకు ఆఅమ్మాయి వెలాతెలా పోయి 'ఆడమనిషి' అన్నది. 'మగమని షని ఎవ్వరన్నారూ' అన్నాను

నేను. అంతటితో ఆఅమ్మాయి చరచరా వెళ్ళిపోయింది. ఇదీ మాయిద్దరికీ జరిగిన సంభాషణ."

"ఇంతమాత్రానికే నటండీ గ్రామంలో మీమీద అంతగగ్గోలు పుట్టింది?"

"చెప్పేదేమిటి? ఇదంతా ఆ పార్థసారథిగాడు చేస్తున్న తతంగం. ఆపిల్ల ఎట్లా పరారీఅయిందో అది నామీదికి తిప్పారు."

"ఎంత స్నేహానికి అంత విరోధ మంటారే అట్లా వచ్చింది మీ ఇద్దరికీ. అయినా ఒకళ్ళతో మనకు విరోధం దేనికి చెప్పండి? మనం ఎంతటివాళ్ళమని?"

"ఒకవేపున వాళ్ళు కయ్యానికి కాలు దువ్వుతూవుంటే నన్నంటావేం? అయినా వాళ్లు ఎన్నికుట్రలు పన్ని నన్నేంచేస్తారు?"

"అట్లా అనబోకండి. అవతలవాళ్లు డబ్బుకలవాళ్లు. మనం చూద్దామా అన్నంలో రాయి తీసుకోలేనివాళ్లం."

"అయితే, ఏమంటావ్? డబ్బుంటే యెవడి కెక్కువ?"

"డబ్బున్నవా ళ్ళేపనన్నా చెయ్యగలరు. గ్రామంలో చూస్తే గోలగా వున్నది. మీరుమాత్రం బైటికి కదలవద్దు."

"నిప్పు పట్టుకుంటే పొక్కుతుందా, లేకపోయినా పొక్కుతుందా? మన కేం భయం?"

"మీ కెప్పుడూ ఇంతే. ఎడదిడ్డమంటే పెడదిడ్డ మంటారు! అసలే పార్టీకక్షులాయె! గ్రామంలో చూస్తే కొట్లాటలు జరుగుతవని పుకారుగా వున్నది! ఇల్లు కదలవద్దంటే నామాట వినరు" అని ఆమె పమిటచెంగుతో కళ్లద్దుకుంటూ అన్నది.

"పిచ్చిదానిలా వున్నావు! నీ కంత భయం దేనికి? దేవుడు చాలా మేలుచేసి, వాళ్లు నామీదికి రావాలేకాని ఇవతల మన పార్టీ లేదూ. మక్కెలు విరగపొడిచి చంపుతారు, తెలిసిందా?"

భోజనం కాగానే ముకుందం పైమీద వుత్తరీయం వేసుకొని పార్టీవాళ్లనలుగురి ఇళ్లకూ వెళ్లి ఈ వుదంతమంతా చెప్పివచ్చినాడు.

ప్రొద్దుకూకింది. ముకుందం వసారాలో లాంతరుదగ్గిర కూర్చుని నిశ్చింతగా పత్రిక చదువుకుంటున్నాడు. ఇంతలో వాకిటి ముందు గల్లంతు వినవచ్చింది. పరారీ అయిన పిల్లతరఫువాళ్లు వుద్రేకంతో పదిమంది కైకర్రలు పుచ్చుకుని ముకుందంఇంటిమీదికి వచ్చేశారు. వీధిగుమ్మంముందు నిలబడి ముకుందాన్ని బైటికి రమ్మని కేకలువేస్తున్నారు. ముకుందంభార్య కంగారుకు అంతు లేదు. ముకుందం వెంటనే దొడ్డిగుమ్మం గుండా కుర్రవాడిని తన పార్టీవాళ్ళకోసం కబురిచ్చి పంపాడు.

వెళ్లిన కుర్రవాడు వచ్చేశాడు. ఇంకా వాళ్లురాలేదు. వాకిటిముందు వాళ్ళ కేకలు జాస్తీ అవుతున్నవి. "మీరు బైటికి వెళ్ళవ" ద్దని భర్తను బతిమలాడుకుని, భార్య వీధిగుమ్మంలోకి వెళ్లి "ఎందుకు నాయనలారా! మాఇంటిమీదికి వచ్చారు? మే మేపాపమూ యెరగము. మీరు వెళ్ళిపొండి" అని వాళ్ళతో చెప్పింది. "ఆడదాన్ని పంపి తాను ఇంట్లో దూరాడా?

బైటికి రమ్మను. కనపడుతుంది" అంటూ వాళ్ళు దుర్భాష లాడడం సాగించారు.

అప్పటికీ తన పార్టీవాళ్ళు రాలేదు. ఇంట్లో ముకుందానికి గాభరా అధికమైంది. పెద్దపులికి బాగా ఆకలివేస్తేనే పంజా విప్పుతుంది! పార్టీగూడా అంతే! సమిష్టిగా బయలుదేరదగిన కారణం ఏర్పడితేనేగాని అది లేచి ఒళ్ళు విరుచుకోదు! లేకపోతే గేదెను వేసిన పులిలా మత్తుగా పడుకొని వూరుకుంటుంది! ముకుందం ఇంకా వాళ్ళు వస్తారన్న నమ్మకంతోనే వున్నాడు. వాకిటిముందు వాళ్ళు చేస్తున్న గోల మిన్నుముట్టుతున్నది. ముకుందానికి కాళ్లు భూమిమీద ఆనడం లేదు. ఇంకా తాను జాప్యంచేస్తే వాళ్ళు ఇంట్లో జొరబడేటట్లున్నారు. ముకుందం ధైర్యంచేసి వీథిగుమ్మంలోకి వెళ్ళి "మీ రన్యాయంగా మాయింటిమీది కొచ్చి ఇట్లా గల్లంతుచేయడం దేనికి?" అన్నాడు.

ఆతని మాట ఆలకించే దెవరు? అతణ్ణి చూడగానే వాళ్ళకు వుద్రేకాలు హెచ్చిపోయినవి. నోటికి వచ్చినట్లల్లా తలోమాటా మాట్లాడుతూ కర్రలు పైకెత్తారు. ముకుందం ఒక్కడూ ఏమి చేయగలడు? అతడు వణికిపోతున్నాడు. భార్య అతణ్ణి లోనికి తీసుకు వెళ్ళడానికి యత్నిస్తూవున్నది.

ఇంతలో "ఏయ్, ఆగండి. వాడిమీద గనక దెబ్బపడ్డదా మీ పరువు దక్కదు." అని పెద్దకేక వినవచ్చింది. ముకుందానికి తన పార్టీవాళ్ళు వచ్చేస్తున్నారని ప్రాణం లేచి వచ్చింది. అంతా అటువైపు చూశారు. పార్థసారథి బాణాకర్ర పుచ్చుకొని వడివడిగా అక్కడకు వస్తున్నాడు. వానకురిసి వెలిసినట్లు అంతా నిశ్శబ్దమయింది. ఎత్తిన కర్రలు అట్లాగే నిలిచిపోయినవి. పార్థసారథి వాళ్ళను సమీపించి "ఎందుకు మీ రన్యాయంగా వాడి ఇంటిమీదికి రావడం? వాడి సంగతి నాకు బాగా తెలుసు. మనిషి పెంకెవాడే కావచ్చు! వాడిదగ్గర యిటువంటి చెడుబుద్ధు లేమీ లేవు. మీఅమ్మాయినిగురించి వాడి తరఫున నేను హామీయిస్తున్నాను. మీరు వెళ్ళిపోండి" అన్నాడు. అంతటితో వాళ్ళు ముఖాలు వ్రేళ్ళాడవేశారు.

పార్థసారథి అన్న మాటలకు ముకుందం తన చెవులను తాను నమ్మలేకపోయాడు. ఆనందపారవశ్యంతో ముకుందం పార్థసారథి రెండు చేతులూ పట్టుకుని "నిన్ను అర్థంచేసుకోలేకపోయినందుకు సిగ్గుపడుతున్నారా సారథీ! ఆరోజున నోటుకు డబ్బు చెల్లించింది గూడా నువ్వేనని ఇప్పుడు తెలుసుకున్నాను. నిన్ను అపార్థం చేసుకున్నందుకు నన్ను క్షమించు" అన్నాడు.

అప్పుడు పార్థసారథి "అయితే నీ తప్పుకు శిక్ష వేస్తున్నాను. యిప్పుడు నాతో మాయింటికి భోజనానికి రారా!" అన్నాడు.